సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

● ఘనంగా టీచర్స్ డే వేడుకలు
● ఉపాధ్యాయులకు సత్కారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు అని కాకరపర్తి భావనారాయణ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు అన్నారు. ఆ కళాశాలలో గురు పూజోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన శేషయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించటంలో గురువుల పాత్ర అపూర్వమన్నారు. గురువులతో సామాజిక వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. సమాజంలోని అజ్ఞానాన్ని పారదోలే గొప్ప సాధనం గురువు అన్నారు. అటువంటి గురువను గౌరవించుకోవటం అందరి బాధ్యత అన్నారు. 100 సంవత్సరాలకు పైగా విద్యారంగ వికాసానికి తమ విద్యాసంస్థలు పాటుపడుతున్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. కేబీఎన్ కళాశాల అధ్యాపకులు సమర్థవంతమైన కృషి కొనసాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు కమిటీ ప్రముఖులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, జి.గంగాధర్, తేలప్రోలు వీరయ్యగుప్తా, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, పీజీ డైరెక్టర్ ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో..

పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ గురుపూజోత్సవ విశిష్టతను వివరించారు. అనంతరం క్లబ్ తరఫున అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, అధ్యాపకులు పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వీసీఎల్ అండ్ టీపీ ఆధ్వర్యంలో..

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పేదలకూ నాణ్యమైన విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం రాత్రి మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్యూటోరియల్స్ అసోసియేషన్ (వీసీఎస్ అండ్‌టీఏ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్య అతిథులుగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి, అవినాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను నాడు–నేడు పథకం ద్వారా అందిస్తున్నామని చెప్పారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. సభ అనంతరం రాయల్ హైస్కూల్ అధినేత ఆజాద్, సిద్ధార్థ క్రియేటివ్ స్కూల్ అధినేత వాసా ఆదినారాయణ దంపతులను అతిథులు సత్కరించారు. వీసీఎస్ అండ్ టీఏ అధ్యక్షురాలు వెనిగళ్ల అమ్మాజీ, కార్పొరేటర్ వై.చలపతిరావు, వీసీఎస్ అండ్ టీఏ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్, అసోసియేషన్ సభ్యులు సాంబశివరావు, షేక్ షరీఫున్నీసా, అనుమాటి చెన్నయ్య, బాడిష ఉషారాణి, సాయి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, అవినాష్, నిర్వాహకులు

జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దేది గురువులే

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాస్ బీఈడీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ రామిశెట్టి జూలియస్ నాయుడును పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భావితరాలను జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. పాఠశాల సెక్రటరీ/కరస్పాండెంట్ టీ సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, అకడమిక్ హెడ్ కేవీ కళ్యాణి, ప్రిన్సిపాల్ సీహెచ్ సుచరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయుడు వేదాంతం శ్రీనివాసరావును సత్కరించారు. రిటైర్డ్ లెక్చరర్ కె.భాస్కరరావు, కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహారావు, ట్రెజరర్ డి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువులను సత్కరించుకోవడం అభినందనీయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువులను సత్కరించుకోవడం అభినందనీయమని హనుమత్ దీక్షా పీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు. కొత్తపేటకు చెందిన ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి కళ్యాణ మండపంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీతో పాటు పలువురు ఉపాధ్యాయులకు ప్రజా వైద్యశాల డాక్టర్ శ్రవణ్‌కుమార్ సత్కరించారు. అనంతరం ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో జాక్ అండ్ జిల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్గనైజేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. రైల్వే ఆడిటోరియంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ వర్షా పాటిల్ ముంబై నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి శ్రీనివాస్, సెక్రటరీ ప్రియాంక, పీఆర్‌ఓ నుస్రత్ మంద్రుప్కర్, రమ్య, శిరిష, లీలా పాల్గొన్నారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, భారత రాష్ట్రపతిగా అందించిన సేవలను కొనియాడారు. సమాజానికి దిశనిర్దేశం చేసి జ్ఞానాన్ని పంచే ఉపాధ్యాయులను గౌరవించుకోవడం గొప్ప సంస్కృతి అన్నారు. అనంతరం విద్యార్థులు చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ, గ్రంథాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజవాడ రాజారావు హైస్కూల్‌లో

విద్యాధరపురం అరవింద వీధిలోగల బెజవాడ రాజారావు హైస్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయ దిన వేడుకల్లో స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు మాట్లాడుతూ విద్య నేర్పే గురువులే భవిష్యత్ మార్గదర్శకులన్నారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రసన్న, స్కూల్ సెక్రటరీ శ్యామ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సెయింట్ జాన్స్ స్కూల్‌లో రామిశెట్టిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



అంబేడ్కర్ హైస్కూల్‌లో..



బెజవాడ రాజారావు హైస్కూల్‌లో..



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జమల పూర్ణమ్మ తదితరులు



కేబీఎన్ కాలేజీలో అధ్యాపకులను సత్కరిస్తున్న పాలకవర్గం



ఉపాధ్యాయులతో దుర్గాప్రసాద్ స్వామిజీ, శ్రవణ్‌కుమార్



ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..

క్లుప్తంగా

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు



విజయవాడస్పోర్ట్స్: నగరంలోని బందరు రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సిబ్బందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. బెంజిసర్కిల్, పటమట ఎన్టీఆర్ సర్కిల్, ఆటోనగర్ గేట్ ప్రాంతాల్లో సీపీ రాణా మంగళవారం పర్యటించారు. బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ బస్టాండ్ వరకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను అక్కడే విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి వివరించారు. నగర వాసులు సహకరించాలని సీపీ కోరారు. సీపీ వెంట డీసీపీ ఎం.రవీంద్రబాబు, ఏడీసీపీ డి.ప్రసాద్, ఏసీపీలు పి.భాస్కరరావు, జె.వెంకటనారాయణ, డాక్టర్ బి.రవికిరణ్ ఉన్నారు.

రౌడీషీటర్లు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పటమట, కృష్ణాజిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ల సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్న రౌడీషీటర్లు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిటీ పోలీస్ కమిషనర్ టీకే రాణా హెచ్చరించారు. పటమట ప్రాంతంలో కొంత మంది యువకులు కలిసి రోడ్డుపై మద్యం సేవించి ఘర్షణ పడుతున్నారని స్థానికులు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలంలో ఉన్న పటమట పోలీసులు రౌడీషీటర్ పండు, రెహమాన్, కోనేరు రాజా, కవి ప్రవీణ్ వారి అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. అసాంఘిక పనులకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని సీపీ వారిని హెచ్చరించారు. పొలిటికల్ సపోర్టుతో రెచ్చిపోతే ఉపేక్షించేది లేదన్నారు.

తెలుగు వారి గుండెచప్పుడు ఘంటసాల



విజయవాడకల్చరల్: తెలుగు వారి గుండెచప్పుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. సంగీత కళాకారుడు పప్పు సదాశివశాస్త్రి ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకులు, గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఏసుదాసుల స్ఫూర్తి కార్యక్రమం సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. పప్పు సదాశివ శాస్త్రి, గుడిపాటి జయరాం ప్రసాద్, మల్లాది స్వాతి తదితరులు ఘంటసాల, బాలు, జేసుదాసు గానం చేసిన గీతాలను ఆలపించారు.

పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో వైసీపీ కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి క్రెడిట్ సొసైటీ రుణమేళా బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని గాయత్రీ కల్యాణం మండపం ఆవరణలో ఈనెల 10వ తేదీన జరగనున్న రుణమేళాను నిరుపేద బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ సీనియర్ బ్రాంచి మేనేజర్ జి.శ్రీనివాస్, నాయకులు చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాస్, లంకా బాబు, చాంద్ శర్మ, మద్దాలి ప్రకాష్, కోలవెన్ను కొండా పాల్గొన్నారు.

ఉత్తమ ప్రొఫెసర్‌గా ఎండీ రియాజుద్దీన్



విజయవాడరూరల్: హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఎండీ రియాజుద్దీన్‌కు ఉత్తమ ప్రొఫెసర్ అవార్డు లభించింది. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్(సాలిట్) సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ అధ్యాపకులకు అవార్డులను ప్రకటించింది. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. రియాజుద్దీన్‌ను పలువురు అభినందించారు.

విద్యార్థులకు సృజనాత్మకత పోటీలు

పటమ(విజయవాడతూర్పు): స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలందరూ సహకరించాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నాలుగో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశం దినోత్సవం సందర్భంగా నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్ పోటీలు, సైన్స్ ఫెయిర్, సృజనాత్మకత పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఏసీ మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నిరోధించేందుకు విద్యార్థుల్లో కాలుష్యాన్ని తగ్గించే సృజనాత్మకమైన ఆలోచనలను రేకెత్తించాలని చెప్పారు. వాయు కాలుష్యం ప్రభావం అనే అంశంపై మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ సత్యవతి

మానవతావాది మదర్ థెరీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనాథలు, అభాగ్యులను నిండు మనసుతో ఆదరించి అక్కున చేర్చుకుని సేవలు అందించిన గొప్ప మానవతావాది మదర్ థెరీసా అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ బాబు అన్నారు. మదర్ థెరీసా వర్ధంతిని పురస్కరించుకుని పశ్చిమ నియోజకవర్గంలోని పెజ్జోనిపేటలో గల ఆర్‌సీఎం చర్చిలో మంగళవారం థెరీసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాంతి, కరుణకు ప్రతీకగా నిలిచిన మదర్ థెరీసా ప్రపంచానికి ప్రేమను పంచారని తెలిపారు. నోబుల్ శాంతి పురస్కారం, భారతరత్న వంటి అనేక అవార్డులు అందుకున్న మదర్ థెరీసా జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సౌందర్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.



మదర్ థెరీసా విగ్రహం వద్ద నివాళర్పిస్తున్న శరత్‌బాబు తదితరులు

మధురం.. వాగ్గేయకార సంకీర్తనం

విజయవాడకల్చరల్: ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు గద్దే వెంకట రామకుమారి జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన అంబటిపూడి కామాక్షి వయోలిన్ సోలో కచేరీ మధురంగా సాగింది. సంగీత మూర్తి త్రయం త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ శ్యామ శాస్త్రి, రచించిన కీర్తనలను వయోలిన్‌పై మధురంగా పలికించారు. కుందుర్తి అరవింద్ మృదంగంపై, ఎం.హరిబాబు ఘటంపై సహకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ.. రామకుమారి సుదీర్ఘకాలం సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేశారన్నారు. అంజనా సుధాకర్, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్ పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బతింటాయని, సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాలను నియంత్రణకు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తమవంతు సహకారం అందించాలని నవజీవన్ బాలభవన్ సీతోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్ట్ జి.అనూష అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు– సోషల్ మీడియా దుర్వినియోగంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు.

ఆమె మాట్లాడుతూ.. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామ వార్డ్ వలంటీర్, మహిళా పోలీసుల సహకారంతో తమ తమ పరిధిలోని ప్రతి కుటుంబంలోని యువతను గమనించాలని సూచించారు. వివరాలకు 94904 92020 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ ఆఫీసర్ రాణి, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ వసంత కుమారి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నేడు కృష్ణాష్టమి వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణునికి పూజా కార్యక్రమాలు, గో పూజ జరుగుతుందన్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి దేవస్థాన పురాణ పండితులచే ఉపన్యాసం, అనంతరం రాజగోపురం ఎదుట ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట లాలీమ బార్ సమీపంలో ఓ డ్యాన్స్ అకాడమీని బామిని సుజాత నిర్వహిస్తున్నారు. సుజాత తన భర్తతో విభేదాల కారణంగా వేరుగా ఉంటుంది. అయితే కొంత కాలం కిందట కొరికాని లక్ష్మీ వెంకటేష్ పరిచయం కావడంతో సహజీవనం చేస్తుంది. వెంకటేష్ చెడు వ్యసనాలను బానిస కావడంతో అతనిని దూరంగా ఉంచింది. దీంతో కొద్ది రోజులుగా వెంకటేష్ సుజాత వెంట పడి వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసి రెండో వివాహం.. ఆపై వేధింపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మోసం చేసి రెండో వివాహం చేసుకోవడంతో పాటు భార్యను వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ప్రజాశక్తి నగర్‌కు చెందిన కాకర్లపూడి రాజ్యలక్ష్మికి 7 ఏళ్ల క్రితం వివాహమైంది. పాప పుట్టిన తర్వాత భర్త చనిపోయాడు. నాలుగు నెలల క్రితం గోపి అనే వ్యక్తి వచ్చి రాజశేఖరరాజు అనే వ్యక్తిని పెళ్లి చేసుకోమని ఆమెను కోరాడు. పాప బాగోగులు చూసుకుంటామని చెప్పడంతో పెళ్లికి అంగీకరించి మే నెలలో రాజశేఖరరాజును రెండో వివాహం చేసుకుంది. పెళ్లయిన నాలుగు రోజుల తర్వాత పాపను రాజ్యలక్ష్మి తండ్రి వద్ద వదిలివేయాలని, తండ్రి ఇంటిని తన పేర రాయించాలని వేధింపులు ప్రారంభించాడు. మద్యం సేవించి శారీరకంగా, మానసికంగా హింసించాడు. ఆమె వ్యక్తిగత విషయాలను రాజశేఖరరాజు తన స్నేహితులు గోపి , శ్రీనివాసులకు చెప్పి ఆమెను ఇబ్బందులకు గురిచేశాడు. జూలైలో గోపి, శ్రీనివాసులు ఆమె ఇంటికి వచ్చి ఆమెను బూతులు తిడుతూ కొట్టేందుకు ప్రయత్నించారు. రాజశేఖరరాజు తన మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా మోసం చేసి తనను పెళ్లి చేసుకున్నాడని రాజ్యలక్ష్మికి తెలిసింది. అప్పటి నుంచి ఆమెను, ఆమె కుమార్తెను మరింత ఇబ్బందులకు గురిచేశాడు. బాధితురాలు రాజ్యలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కేఎల్‌యూ విద్యార్థికి జపాన్ ఐటీ కంపెనీలో ఉద్యోగం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సిటీలో ఈసీఈ చదువుతున్న ముల్లా అబ్దుల్ ఖాదిర్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఉద్యోగాల కల్పనలో భాగంగా క్యాడ్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్‌లను అభివృద్ధి పరిచే సిస్టమ్ మ్యాట్రిక్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.26 లక్షల వార్షిక జీతంతో పాటు వసతి, ప్రయాణ ఖర్చులు వంటి పలు రకాల అలవెన్సులను కంపెనీ కల్పిస్తుందన్నారు. విజయవాడకు చెందిన ముల్లా అబ్దుల్ ఖాదిర్ తల్లిదండ్రుల సొంతూరు విజయవాడ అయినప్పటికీ ప్రస్తుతం వారు విదేశాలలో ఉంటున్నారని తెలిపారు. భాషా సమస్య లేకుండా ఉండటం కోసం వర్సిటీలో ఉన్న విదేశీ భాషల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థి ఖాదిర్‌కు జపాన్ భాషపై ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.



ముల్లా అబ్దుల్ ఖాదిర్

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి, వారికి సరైన వైద్యం అందేలా వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా (డీఫార్మిటీ, డెఫిషియన్సీ, చైల్డ్‌హుడ్ డీసీజెస్, డిలే) వైకల్యం, లోపం, బాల్యవ్యాధులు, ఆలస్యం–4డీల సామర్థ్య పెంపు పునశ్చరణ శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో 360 మంది వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ పిల్లలకు వచ్చే వ్యాధులు, లోపాలు సత్వరమే గుర్తించడం ద్వారా వారిని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రానికి పంపించి చికిత్స అందించి ఆరోగ్యం మెరుగుపరచవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, కుటుంబ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు పాల్గొన్నారు.

రాత్రి 10 తర్వాతే ఈట్ స్ట్రీట్ ప్రారంభించాలి

పటమట(విజయవాడతూర్పు): ఇందిరాగాంధీ స్టేడియం వద్ద విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌ను రాత్రి 10 –12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎస్టేట్ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించి ఈట్ స్ట్రీట్‌లో స్టాల్స్ కేటాయించిన వారంతా సాయంత్రం 6 గంటలకే స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 10 గంటలకు ముందు ఎవరైనా స్టాల్స్ పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి స్టాల్ వద్ద విధిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.